**శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లి కథల పోటీలో**

**విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ**

చీరచెంగును భుజాలపై నుండి లాక్కొని వక్షస్థలంపై నిండుగా కప్పుకుంది. చేతులు రెండూ జోడించి

‘‘నమస్తే.... మేడమ్...’’ అంది

ప్రిన్సిపాల్ తల ఎత్తి చూసింది.

నందివర్ధనం పువ్వులా... గంజిపెట్టిన తెల్లచీరెలో తెల్లటి మహిళ. నిరాడంబరతలో వినూత్నమైన అందం. విధవలాంటి కట్టూబొట్టూ... కానీ ఆమె విశాలమైన పాలభాగం మధ్యలో ధగదగా మెరుస్తూన్న తిలకం. చేతినిండా గాజులు.

పరస్పర విరుద్ధమైన అలంకరణ.

‘‘ప్లీజ్... బీసీటెడ్’’.

‘‘మేడమ్... నా కొడుకుని స్కూల్లో వెయ్యటానికొచ్చాను’’.

‘‘ఏ క్లాసులో’’

‘‘నర్సరీలో...’’

‘‘మూడేళ్ళు నిండాయా?’’



# పెళ్ళికాని తల్లి

తాడిగిరి పోతరాజు

‘‘నిండలేదు. ఇంకా మూడు నెలలయితే... కానీ మేడమ్... నా కొడుకుని ఇంటి వద్ద పట్టుకొనే అమ్మమ్మగానీ, నాయనమ్మగానీ ఎవరూలేరు. ‘ఆయమ్మ’ – ఉంది. కానీ వాళ్ళవాళ్ళెవరో చనిపొయ్యారనీ ఊరెల్లిపోయింది... దినాలు అయిపొయ్యే వరకూ రాదు. ...అందువలన...’’

‘‘మీరు ఏం చేస్తుంటారు?’’

‘‘ఎస్.బి.హెచ్‌లో క్యాషియర్ని... నాల్గు రోజుల నుండి వీడ్ని బ్యాంక్‌కు వెంట తీసుకుపోతున్నాను నేను.. కానీ బ్యాంక్ అంటే... అంతా డబ్బుతో కూడిన వ్యవహారం. లెక్కల్లో తప్పుపోతే కంప్యూటర్ ‘గీ–గీ–గీ’ అని తిప్పికొడ్తది. మళ్ళీ మళ్ళీ కూడి ఎకౌంట్ కరెక్ట్ చేసి కంప్యూటర్‌లో ఫీడ్ చేసే సరికి, తలప్రాణం తోక కొస్తది. ఒక వైపు వీడు. మరొకవైపు నోట్లకట్టలు... ఎదురుగ్గా ఇంటెలిజన్స్ ఆఫీసర్‌లా కంప్యూటర్... పని చేసుకోలేక పోతున్నాను’’.

‘‘అయితే డేట్ ఆఫ బర్త్ సర్టిఫికేట్ మార్చి తెచ్చుకోగలరా?’’

‘‘ప్రయత్నిస్తా... అప్పటివరకూ స్కూలుకు రానివ్వండి...’’

‘‘టెర్మ్‌ఫీజ్... పదిహేను వందలు...’’

‘‘ఫర్వాలేదు... ఇదిగో ఫీజ్’’....

‘‘మీరు ఈ ప్రక్క గదిలో కూర్చొని అప్లికేషన్ ఫాం నింపి ఇవ్వండి...’’ అప్లికేషన్ ఫాం అందిస్తూ...

‘‘డేట్ ఆఫ బర్త్’ కాలం విడిచిపెట్టండి’’ అంది ప్రిన్సిపాల్.

‘‘మంచిది.. మంచిది’’ అంటూ పక్క గదిలోకి నడిచింది. కూర్చోకుండానే నిలబడి అప్లికేషన్‌పై చూపులు నిలిపింది.

కాళ్ళలో సన్నని ఒణుకు – కుప్పకూలిపోయింది కుర్చీలో. మళ్ళీ మళ్ళీ చదివింది. అవే అక్షరాలు. అవే వివరాలు. గోడపై చూపు నిలిపింది. సుదీర్ఘమైన నిట్టూర్పుతో మనసును అదుపులోకి తీసుకొని, అప్లికేషన్ ఫామ్‌ను పరచి, మడతలన్నీ ‘సాఫ్’ చేసి నింపసాగింది.

విద్యార్థి పేరు... ‘డాష్... డాష్... డాష్... ‘అమర్’ ... నింపింది.

ఇంటిపేరు ... డాష్... డాష్... డాష్.... నింపకుండా వదిలివేసింది.

తండ్రి పేరు... ఆందోళన కలిగించే కాలమ్. ‘మధుసూదనరావ్’ అంటూ నింపింది. ఏదోఉద్విగ్నత. ఏదో వ్యాకులత. మెదడులోని నరాలు చిట్లిపొయ్యేలా హైవోల్టేజి. వెంటనే కొట్టిపారేసింది. అక్షరాలు పోల్చుకోకుండా బండ బండగా కొట్టిపారేసింది. కసికసిగా అడ్డగీతలు గీసి పెన్ గాలిలోకి ఎత్తిపట్టుకుంది.

‘‘ఇంకా నింపలేదా!.... అమ్మా’’ ప్రక్క గది

నుండి ప్రిన్సిపాల్ పిలుపు – హెచ్చరిక. నింపని అప్లికేషన్ ఫామ్ పట్టుకొని ప్రిన్సిపాల్ రూమ్‌లో అడుగు పెట్టింది.

మేడమ్ తలవంచుకుని సీరియస్‌గా రాసుకొంటోంది. పైన కిర్రుకిర్రుమంటూన్న ఫ్యాన్ చప్పుడు. 'మే...డ... మ్' – మెల్లగా పిలిచింది. భయం భయంగా.

ఆమె తల పైకెత్తలేదు. ఫైల్లో తలదూర్చి ఏకాగ్రతతో టిక్కులు పెడుతోంది.

ఆమె యాభైఏళ్ల పైబడిన మహిళ. పాయలు పాయలుగా నెరసిన తలపండిన తన జీవితానుభవాలకు సంకేతాలు. వలయాలు వలయాలుగా కళ్ళ చుట్టూ రూపు దిద్దుకొంటున్న నల్లని గీతలు. కష్టాలు, సుఖాలుగా వడపోసిన గీతలు...

''మేడమ్...'' గొంతుస్థాయిని పెంచి పిలిచింది మళ్ళీ.

''సారీ... పని తొందరలో గమనించలేదు మిమ్ములను... ఫాం, నింపారు కదా! ఇటివ్వండి –'' తల పైకెత్తిన ప్రిన్సిపాల్, చెయ్యిచాపింది.

అప్లికేషన్ ఫాం. ఆమెకు అందివ్వకుండా... ''తండ్రి పేరు కొట్టేశాను. దాన్ని తల్లిగా మార్చుతా... మీరు ఒప్పుకుంటే'' అని ఆవేశ పూరకంగా ఇంగ్లీషులో పలికింది.

''వై... ఫాదర్... వై కాంట్ ఇట్ బి మదర్?'' (Why father - Why cann't it be mother) అంది.

అనూహ్యమైన ప్రశ్న. అనూహ్యమైన పరిణామం. బిత్తరపోయిన ప్రిన్సిపాల్ మనస్సులో మాటలను పేర్చుకొని, సంయమనంతో అనునయంగా...

''తండ్రి లేడా?.... అమ్మా'' అంది. అమ్మా పిలుపులో కమ్మదనం కంఠంలోనికి మార్చి వాత్సల్యానికి సమాధానంగా ఆమె బుగ్గలపై కన్నీళ్లు. కన్నీళ్ళు తుడుచుకొని.

''ఉన్నాడు... కానీ'' కంఠం పెగలలేదు.

''మరి....'' ప్రిన్సిపాల్ కంఠంలో సందేహం.

''ఉన్నా... లేనట్టే..''

''ఉంటే. తండ్రిగా బాధ్యతలు తీసుకోడా?''

''బాధ్యతలతో పనిలేదు. నా బాబుకు తానే తండ్రిననే సత్యాన్ని గ్రహిస్తేచాలు...'' కలవరం చెందిన ప్రిన్సిపాల్ చూపులు ఎదుటివ్యక్తి గుండెలపై నిలిచాయి. గుండెలపై తళుకు, తళుక్కున మెరిసే మంగళసూత్రం కొరకు అన్వేషణ. మెడ చుట్టూ ఉండవలసిన నల్లపూసల తాడుకై అన్వేషణ. మెడ బోసిబోసిగా ఉంది.

చూపులు కాళ్ళపై వాలాయి. కాళ్ళకు మెట్టెలు లేవు.

పేపర్‌వెయిట్ క్రింద రెపరెప కొట్టుకుంటూన్న తెల్ల కాగితాలు. అంతా స్తబ్దత. ఇబ్బందికరమైన వాతావరణం. ఎదుటివ్యక్తి యొక్క వ్యక్తిగత జీవిత విశేషాలు అడగకూడదన్న సంస్కారంతో నిగ్రహం పాటిస్తూ..

''జీవితంలోఎవడైనా... మోసగించాడా, బిడ్డా!''

బిడ్డా..న్న పిలుపులో మాధుర్యం... పలకరింపులో ఆత్మీయత... హృదయ కుహరాలలో గింగిరుమనే అనురాగపు అనుబంధం.

''లేదమ్మా...'' బుస, బుస పొంగుతున్న ముఖాన్ని తుడుచుకుంటూ... ''నన్ను నేనే మోసగించుకున్నాను... మోసగించబడే బలహీనత మనలో ఉన్నప్పుడే, ఎదుటివ్యక్తి మనల్ని మోసగించ గలడు''.

''బాధపడకమ్మా... ఆడపిల్లల జీవితాలింతే – ఎవరికీ చెప్పుకోలేని బాధలు... 'ఛాయి' తాగుదామా... బిడ్డా... యాదమ్మా ఫ్లాస్క్ తీసుకుపోయి రెండు ఛాయిలు తీసుకురా... ఇంతకూ నీ పేరు చెప్పలేదు బిడ్డా.''

''కుంతి...''

''కుంతి... నా! ఇదేం పేరు?''

''నేను పెళ్ళి గాని తల్లిని... అందువలన'' మాటలలో నామోషీ లేదు. నటన లేదు. నసుగుడు లేదు. నత్తి లేదు. భీతికొలిపే స్పష్టత.


ఛాయిలు రెండు కప్పుల్లో పోసి అందించింది యాదమ్మ – 'గణ, గణ' మని గంట కొట్టిన శబ్దం. ఖాళీ కప్పు టేబుల్‌పై పెట్టి – ''కూల్‌డౌన్ బిడ్డా – ఎక్కువగా ఆలోచించి మనసు పాడు చేసుకోకు. తెలివి గలదానివి.... గార్డియన్, కాలమ్‌లో సంతకం పెట్టి ఫామ్ ఆఫీసులో ఇచ్చెయి... నాకు క్లాసుంది... లాన్‌లో కూర్చో'' అంటూ బయటికి పోయింది.

***

లాన్ – దీర్ఘచతురస్రాకారపు లాన్ – దాని చుట్టూ ఎరుపు – పసుపు పూలతో హుందాగా నిలబడిన మెట్టతామరలు. 'లాన్' మధ్యలో ఆటస్థలం. అందులో ఆట పరికరాలు.

చిన్నచిన్న కుర్చీలు అమర్చిన ''మెర్రీ గో రౌండ్'' (Merry go round) గొలుసులు కట్టిన ఉయ్యాలలు. జారుడు బల్లలు.

ఆటస్థలం నిండా, ఎగురుతూన్న పువ్వుల్లా, ఐదేళ్లలోపు చిన్నారులు, కేరింతలు కొడ్తూ ఆడుకొంటున్నారు. కొందరు ఉయ్యాలలపై – కొందరు మెర్రీ గో రౌండ్ కుర్చీలలో, కొందరు జారుడుబల్లపై. తన కొడుకు నిచ్చెనపై నుండి దిగి బల్లపై జారుతూ.



''హమ్–మమ్మీ – మమ్మీ – 'హమ్'' – అని చెయ్యి ఊపాడు.

''హమ్ – నాన్నా... మెల్లగా... మెల్లగా పడిపోతావ్'' చెయ్యి ఊపింది నవ్వుతూ.

ఆకాశంలోని తెల్లమబ్బుల వంక చూస్తూ, కారిడార్‌లోని బెంచిపై కూలబడ్డది. ఆకాశంలో పేలిపోయిన తన జీవితం, శకలాలు, శకలాలుగా నేలకు దిగుతున్న దృశ్యాలు – కళ్ళ ముందు.

***

ఐ లవ్ యు దీప్తి . (I love you Dheepti) యు ఆర్ ఏ సోబర్ అండ్ డిగ్నిఫైయిడ్ లేడీ. (You are a sober and dign-

ified lady) ఇంగ్లీషులో పొగడ్తల, ప్రశంసల జల్లుల్లో తడిసిపోయిన మనస్సు వివేకం కోల్పోయింది. నడుం చుట్టూ అతని చెయ్యి. ఫస్ట్ స్లిప్.

''మన పెళ్ళికి మంచి ముహూర్తం కోసం అయ్యగారి దగ్గరకు పోదాం!''

''నాకు ముహూర్తాలు – శుభలగ్నాల మీద నమ్మకం లేదు – దీప్తీ...''

''మరి... రిజిస్టర్ మ్యారేజీ చేసుకుందామా?''

''నాకెలాంటి అభ్యంతరం లేదు. కానీవాడు. నీ కులం ఏమిటి – ఆమె కులం ఏమిటని పిచ్చిపిచ్చి ప్రశ్నలడుగుతాడు. వాడికన్నిటికీ సమాధానం చెప్పడం పెదడెలికసీ. కులమతాలకు అతీతంగా ఒక్కటయిన మనం ఇటువంటి ఫార్మాలిటీస్‌కు అతీతంగా ఉండాలి. అప్పుడే మనం ఆదర్శ దంపతులుగా ఉండగలం.''

''చిన్న ఫంక్షన్ పెట్టి... మన ఫ్రెండ్స్‌ని పదిమందిని పిలుద్దాం. దండలు మార్చుకుందాం''.

''పిచ్చి దీప్తి. నీదంతా చాదస్తపు ఆలోచన... భార్యాభర్తల మధ్య అవగాహన ముఖ్యం. దండలు మార్చుకోవటం – రిజిస్టర్ మ్యారేజెస్ – అంతా వేస్ట్... ఆ పెళ్ళిళ్ళు కూడా ఫెయిలయ్యి డైవర్సయినవి ఎన్నిలేవు.. తాళికట్టకపోతే, భార్యవు కావా నీవు? తాళిబొట్టూ – గాజులూ, మెట్టెలూ ... అన్నీ ప్రిమిటివ్ సొసైటీ లక్షణాలు.''

***

''మీకొక తీపి కబురు – ముందు మీరు నోరు తెరవండి. గులాబ్‌జామ్ నోట్లో వేసుకోండి... మీరు తండ్రి కాబోతున్నారు''.

''వద్దు – వద్దు – దీప్తీ... పిల్లలూ, సంసారం. ఈ జంజాటంలో ఇరుక్కోవటం నాకిష్టం లేదు... అబార్షన్ చేయించుకో!''

''లివింగ్ టు గెదర్ – (Living together) అంటే పెళ్ళికాదన్న మాట – మనం భార్యాభర్తలం కాదన్నమాట ... అంతేనా?''

''దీప్తీ... కూల్‌డౌన్''.

''నేను నీ భార్యను కానప్పుడు, నాకు పుట్టబోయే బిడ్డకు నీవు తండ్రివి కాదన్నమాట. యూ ఛీట్... నీవేమిటో నాకిప్పుడే తెలుస్తుంది. తండ్రి ఎవరో నిర్ధారణకు డి.ఎన్.ఎ. (D.N.A) టెస్ట్ లున్నాయి. వాటిలో నువ్వే తండ్రివని తేలితే...''

తను ఆ మాటలు పూర్తి చెయ్యకుండానే అతను.

''టెస్ట్‌లో నేనే తండ్రినని తేలితే... నా మీద పోలీస్ రిపోర్టు చేసి కేసు పెడతావా?''

''డెఫినిట్‌గా పెడతా! నిన్ను బజారుకీడుస్తా... నీలాంటి ఛీట్స్ అందరికీ ఒక గుణపాఠం నేర్పుతా... యుఆర్‌ఏ వైట్ కాలర్డ్ రోగ్ (You are a white collared rogue).''

''నన్ను రోగ్ అంటావా?... క్రిమినల్ అంటావా?''

''చెయ్యి దించు... దించుకో... ఇదిగో... నా చేతిలో టేబుల్ నైఫ్''.

''నువ్వు ఫైర్ బ్రాండ్ ఆడదానివి... మర్డర్ చెయ్యటానికి కూడా వెనకాడవు... మళ్ళీ ఈ జన్మలో నీ ముఖం చూడను''.

''పో... ముందిక్కడ్నించి... ఇవిగో నీ బట్టలు.. బ్రీఫ్ కేస్...''

''మమ్మీ... మమ్మీ...'' కొడుకు పిలుపు. అప్పటి వరకు తనను చుట్టుముట్టిన స్మృతుల విచ్చిన్నం.

''మమ్మీ... నువ్వు ఉయ్యాలలో కూర్చో... నేను ఊపుతా..''

తాను కోల్పోయిన జీవితాన్ని నిలబెట్టటానికి అవలంబనగా తన కొడుకు. పరవశం చెందిన ఆమె కొడుకుని గుండెలపైకి లాక్కుని మూడుసార్లు – నొసలు ముద్దుపెట్టుకుంటూ.

అదా – ''మీ కోసం... పెద్దవాళ్ళ కోసం కాదు. ఇంటికి పోదాం పద'' అంది.

***

ఆరోజు... ఆఫీసు పని ముగించుకున్న దీప్తి ఇంటికివచ్చి వరండాలో ఉన్న ఛెయిర్ లాక్కుని రిలాక్స్ అయింది. పని మనిషి అందించిన మంచి నీళ్ళు తాగుతూ న్యూస్‌పేపర్ అందుకుంది. అంతలోనే గేటు తీసిన శబ్దం.

తన కొడుకు బూట్లు టకటకలాడించుకుంటూ లోని కొచ్చాడు. వీపుపై వేలాడుతున్న స్కూల్ బ్యాగ్ మూలకు విసిరివేశాడు. లంచ్‌కిట్ తల్లి ఒడిలో పెడుతూ...

''ఆకలేస్తోంది మమ్మీ... త్వరగా అన్నం పెట్టు'' అన్నాడు.

''లంచ్ అవర్‌లో తిన లేదా?'' – అంటూ లంచ్ బాక్స్ మూత తీసి చూసింది. అంతా ఖాళీ.

''తిన లేదు.. మమ్మీ అంతా కుక్కపిల్లకు పెట్టాను''.

''కుక్క పిల్లా... ఏం కుక్క పిల్లరా...''

''మమ్మీ.. మా స్కూలు గేటు ప్రక్కన మోరీ ఉంది. అందులో బుజ్జి కుక్కపిల్ల ఉంది. బొజ్జగా, తెల్లగా భలే ఉండాది.. మమ్మీ ఎంత మంచిగుంటదో తెలుసా!... కానీ దానిచెవులు ఎర్రగా ఉంటయ్ మమ్మీ... లంచ్ అవర్‌లో నేను బయటి కొచ్చి దాన్ని పిలుస్తా.. చిటికెవేసి, చెయ్యి ఊపితే ఉరికి, ఉరికి నా దగ్గర కొచ్చి నా బూట్లు నాకు తది. 'కుయ్... కుయ్' మంటూ, నా కాళ్ళ చుట్టూ గుండ్రంగా తిరుగుతుంది. మొన్నదాని నా చేతుల్లో ఎత్తుకుంటే, నా మూతి, బుగ్గలూ నాకింది... గబ్బు వాసన... వెంటనే దించేశా!...

లంచ్ అవరయిపోయినాక గంట కొట్టారు. అది నాతోపాటు లోని కొస్తూంటే 'ఇమామ్' – లోనికి రానివ్వలేదు. బూటుకాలితో తన్నాడు. అది ఓ.. ఓ.... ఓ. అవి ఏడ్పుకుంటూ బయటికి ఉరికింది'' మెడచుట్టూ ఉరితాడులా బిగుసుకున్న 'నెక్ టై'ని పీకి అవతల పారేశాడు.

''హిమామ్... వాచ్‌మన్ కదా!... కుక్కలను, పందులను లోనికి రాకుండా చూడాలి అతను.. అది అతని డ్యూటీ... కుక్క కూడా నీకు లాగ స్టూడెంట్ కాదు గదా! – లోనికి రానివ్వటానికి''

''అవున్లే గానీ... కాలితో తన్నటం ఎందుకు?... 'అజీ' 'అజీ' అని బెదిరిస్తే ఉరికి పొయ్యేది కదా!... ఇమామ్‌గాడు 'పెద్ద'లంగా' మమ్మీ... మమ్మల్ని కూడా గంటకొట్టినాంక 'నడువ్రి – నడువ్రీ' అని లోనికి నూకి గేటు తాళం వేస్తాడు... వాడ్ని బాగా తన్నాలి మమ్మీ... నేను పెద్దయ్యాక వాడ్ని తంతా!...'' అంటూ బూటు లేసు ఊడదీసి... వాటిని గోడ ప్రక్కనే పెట్టాడు.

''బాయిల్డ్ – ఎగ్ – కూడా దానికే పెట్టావా?'' అడిగింది.

''అవ్... మమ్మీ... నేలమీద వేసిన అన్నమంతా తిని. ఇంకా నా ముఖంలోకి చూస్తాంటే.. పాపం అన్నం చాల్లేదేమోనని గుడ్డు కూడా వేశాను. గబుక్కున మింగింది.''

''ఉద్ధరించేవ్. లే.... నీ కోసమని గుడ్డు పెడితే... కుక్క పిల్లకేస్తావా?'' చిరుకోపం నటిస్తూ.

''జానకమ్మా రెండు చపాతీలు అర్జెంటుగా కాల్చు... బోర్నవిటా తరువాత కలుపు. ఈలోగా నేను స్నానం చేయించుతా'' అంటూ కొడుకుని ఎత్తుకొని బాత్‌రూం వైపు నడిచింది.

స్నానం చేయించి. టర్కీటవల్‌తో ఒళ్ళు తుడవ సాగింది.

''మమ్మీ... బడి నుంచి రాంగ (వచ్చేటప్పుడు) ఇప్పుడు చూశా. దాని మమ్మీ వచ్చింది. మోరీ ప్రక్కన



గడ్డిలో నిలబడింది. బుజ్జి కుక్క పిల్ల వెనుక కాళ్ళ మీద నిలబడి, ''జుయ్ జుయ్'' మని పాలు తాగు తాంది. నన్ను చూసి తోకఊపింది. కానీ నా దగ్గరకు రాలేదు. బాగా ఆకలయినట్టుంది. అది పాలు తాగు తున్నప్పుడు దాని మమ్మీ, దాన్ని అదే పనిగా నాకు తోంది. 'కుక్క పిల్లకు కూడా డ్యాడీ లేడు... మమ్మీనే''

ఆమె చేతిలో టవలు జారి క్రిందబడ్డది. రెండు కన్నీటిబొట్లు – టప్‌టప్‌మని జారి పడ్డాయి ఆమె వక్షస్థలంపై. కొడుకు వాటిని చూడకుండా, మళ్ళీ బాత్‌రూమ్‌లోకి దూరింది. ఆలోచనల నుండి తేరు కొని కిచెన్‌లోకి వెళ్ళి – చపాతీల పళ్ళెం అందుకొని కొడుక్కు అందించింది.

''ముందు తిను – తరువాత ముచ్చట్లు.. మంచి నీళ్ళు మరచిపొయ్యా'' అంటూ లోనికి వెళ్ళింది.

''తింటున్నా గానీ.. మమ్మీ... నా క్లాసులో నా దోస్తులందరికీ డ్యాడీలుండారు. హోమ్‌బెల్ కొట్టేస రికి వాళ్ళ డ్యాడీలు, గేటు వద్ద సైకిల్ మోటార్లతోటి ఎదురు చూస్తుంటారు. వాళ్ళ డ్యాడీల వెనక నా దోస్తులు కప్పుల్లా కరుచుకొని – 'మామ్ – టాటా' – అంటూ చేతులూపుతూ వెళ్ళిపోతారు..... మరి... మన డ్యాడీ... చచ్చిపొయ్యాడా?'' మంచినీళ్ళ గ్లాసు అందించిన తల్లిని అడిగాడు.

ప్రశ్న. అనూహ్యమైన ప్రశ్న... సమాధానం చెప్పలేని నిస్సహాయత. కొడుకు కేసి దీర్ఘంగా చూసింది. కొడుకు. తన ఉదరం నుండి ఉద్భవిం చిన ప్రాణి. ఆ ప్రాణిలో మొగ్గ తొడుగుతున్న మేధస్సు. ఆ మేధస్సు నుండి పుట్టిస్తున్న హేతుబ ద్ధమైన ప్రశ్నలు. పరిష్కారం దొరకని ప్రశ్నలు.

సమాధానం కోరుతున్న చూపులు.

వెంటనే స్పందించాలి. లేకపోతే మరిన్ని ప్రశ్నలు. మరిన్ని సందేహాలు.

''నాన్న... అమెరికాలో ఉన్నారు... త్వరలో వస్తారు..''

''అన్నీఅబద్ధాలు. నేను యల్.కె.జీలో ఉన్నప్పటి నుండి ఇదేమాట చెబుతున్నావ్... నాన్న అమెరి కాలో లేడు... నీవన్నీ అబద్ధాలు'' .... 'నువ్వే'– అని గట్టిగా పలికి, చూపుడువేలు తన గుండెల వైపు చూపించాడు. తనను దోషిగా చూపెడుతున్న ఆ వేలు తనను భయభ్రాంతులకు గురిచేసింది. గుండె లను పిండుతున్న అనుభూతులు. లోయలోపడిన అనుభూతి. పైకి లేచే ప్రయత్నంలో మళ్ళీమళ్ళీ జారిపడిపోతున్న అనుభూతి. అనుభూతులు సృష్టి స్తున్న దుఃఖం మాటలలో పొదగలేని దుఃఖం – కన్నీళ్ళ బాధగా మారి చెంపలపై కారిపోసాగింది.

తల్లిదీనావస్థ చూసి ఆ పసిమనుస్సు కరిగిపో యింది.

''ఎందుకేడుస్తున్నావ్ మమ్మీ... ఏడవకు... మా మంచి మమ్మీవి కదూ!'' అంటూ తల్లిని ముద్దు పెట్టుకున్నాడు. ఉవ్వెత్తున ఎగిసిపడుతూన్న ప్రేమో న్మాదంతో, కొడుకును గుండెలకు హత్తుకుంది. తల్లి కన్నీటితో ఆ పసివాని తల తడిచిపోయింది.

***

వారం రోజులు గిర్రున తిరిగి పొయ్యాయి... ఆ రోజు ఆఫీసునుండి ఆలస్యంగా వచ్చింది దీప్తి. అయిదున్నర గంటలు. రోజులాగానే కొడుకు కోసం ఆతురతతో లోనికి తొంగిచూసింది. కొడుకు కోసం చూస్తున్న ఆమె కళ్ళలో కుక్కపిల్ల – సన్నజాజి పందిరి క్రింద గుంజకు కట్టివేసి ఉంది. దాని ముందు ఖాళీ గిన్నె. ఉబ్బినపొట్టతో మత్తుగా పడు కొంది. గేటు చప్పుడు వినిలేచి 'బౌ.. బౌ... బౌ' మంటూ తనను బెదిరించసాగింది. లోపల నుండి కొడుకు ఉరుకుతూ బయటికి వచ్చి...

''టైగర్.... టైగర్'' అని కుక్కపిల్లని, వారించి ''భయపడ్డావా? ... మమ్మీ'' అన్నాడు. కుక్కపిల్ల తన తల్లిని భయపెట్ట కలిగినందుకు ఉబ్బితబ్బిబ్బై పోతూ... ''మమ్మీ... నువ్వు టైగర్ – టైగర్' అను నిన్నేమీ అనదు'' అని సలహా ఇచ్చాడు.

''ఎక్కడిదిరా ఈ కూన–''

''ఆ రోజు నీకు చెప్పిన కుక్కపిల్ల ఇదే మమ్మీ... ఈ రోజు దాని మమ్మీ రాలేదు దానికి పాలివ్వలేదు. ఆకలితో కుఁయ్ కుఁయ్' మంటూ రోడ్డంతా వెతి కింది... పాపం దాని మమ్మీ ఎక్కడికి పోయిందో ఏమో... నన్ను చూడంగానే నా వెంటబడ్డది. 'గున – గున' నడుస్తూ. దాని మమ్మీ వచ్చేవరకూ... ఇక్కడే ఉంచుకుందాం... మమ్మీ... ప్లీజ్''.

''ప్లీజ్––'' న్న మాటలతో ఆమె ప్రసన్నం కాలేదు.

''ఇది టాయిలెట్‌కు పోతే... ఇల్లంతా గలీజయి పోతది. కడిగినా ఇల్లంతా గబ్బు వాసన''.

''ప్లీజ్ మమ్మీ దాని మమ్మీ వచ్చినాక... మోరీ కాడ విడిచి పెడతా?''

***

మరుసటి రోజు నగరం ఒళ్ళు విరుచుకుంటున్న సమయం సెంట్రీకానిస్టేబుల్స్ చేతిలో లాఠీలు, సైకిళ్ళతో సర్దుకుంటున్న వేళ... పేపర్ బాయిస్, న్యూస్‌పేపర్స్ ఇళ్ళల్లోకి విసురుతున్న వేళ. రోడ్డు ప్రక్కన – టీస్టాల్స్'లో బొగ్గులు రాజుకుంటూన్న వేళ... మున్సిపాలిటీ దీపాలు నిద్రకు సన్నద్ధమౌ తున్న సమయం.

ఏడుపు... బిగ్గరగా ఏడుపు.

తుళ్ళిపడిన దీప్తి బయటికొచ్చింది. కొడుక్కు ఏమయిందోనన్న ఆందోళనతో.

''మమ్మీ... టైగర్ లేదు... టైగర్ కనిపించటం లేదు''.

''ఎక్కడికి పోదులే. ఈ ప్రక్కనే ఎక్కడో ఉంటుం ది... తెల్లవారనివ్వు. వెతుకుదాం... మెట్లపైన పెట్టిన పాలప్యాకెట్లు తొక్కింది నీవేనా?''

మెట్టుపై నుండి క్రిందికి ప్రవహిస్తూన్న పాల ధారల వంక చూస్తూ అడిగింది.

''ఔను''న్నట్టు తల ఆడించాడు.

''పొద్దు... పొద్దునే ... ఇల్లంతా ఆగమాగం... ఈరోజు మనకు పాలెట్లా?'' అనుకుంటూ కొడుకు వీపుపై ఒకటి చరిచింది. అప్పటివరకూ దీర్ఘం తీస్తూన్న ఏడుపు ఆగిపోయింది. ఎన్నడూ తనపై చెయ్యి చేసుకోని తన తల్లి ప్రవర్తనతో, ఆ పసిహృ దయం తల్లడిల్లిపోయింది. దీర్ఘంగా తల్లిని చూస్తూ సన్నజాజిపాదులో చతికిలబడి పొయ్యాడు. కుక్క పిల్ల తిన్న ఖాళీ గిన్నెను నేలపై కొడుతూ.

''బాబూ.. ఆ కుక్క పిల్లపోతే పోయింది. లే. వెధవ ఊర కుక్క... నీకు మంచి అల్సేషన్ కుక్క పిల్లను కొనిస్తా... బడికి తయారవ్... లోనికి పో...'' అంటూ చీపురందుకుని నీళ్లు చల్లుతూ మెట్టుపై



## ఎంత కష్టమైనా పడతా...

ప్రస్తుత పరిస్థితుల్లో హీరోయిన్లు ఒక పడవ మీద (ఒక భాషలోనే) కాలు పెట్టి ప్రయాణించడమే కష్టతరంగా మారింది. అలాంటిది త్రిష ఏకంగా మూడు పడవలమీద (మూడు భాషలలో) ప్రయా ణిస్తూ అదరగొడుతోంది. ఇదెలా సాధ్యం? అని అడిగితే చాలా సింపుల్...అంటూ తేల్చేసింది. 'కష్టప డడం తన నైజమని, గుర్తింపు కోసం ఎంత కష్టమైనా పడతా' అని చెపుతోంది. 'బాలీవుడ్‌లో నా తొలి చిత్రం విడుదల కానుంది, ఇదే కాకుండా అక్షయ్ సరసన మరో రెండు చిత్రాలు అంగీకరించాను. ఒళ్లు దాచుకోకుండా కష్టపడతాను కనుకనే అక్షయ్ తిరిగి రెండు చిత్రాలలో అవకాశం ఇచ్చాడు. నా కష్టానికి ఇంత కన్నా మంచి నిదర్శనం ఉందా?'అని ముగించింది.

కాగా, కష్టపడడానికీ, ఒళ్లుదాచుకోకపోవడానికి చాలా తేడా ఉందనీ, అది త్రిషకి ఇంకా తెలిసినట్టు లేదనీ పలువురు గుసగుసలాడుతున్నారు. త్రిష తాజాగా తన గుండెల మీద వేయించుకున్న టాటూ పలువురి విమర్శలకు గురికావడమే కాకుండా తల్లి ఆగ్రహానికి కూడా కారణమైంది. టాటూ ఎక్కడ వేయించుకోవాలి? అన్నది తన స్వవిషయమనీ, ఇందులో అందరూ అంత రాద్ధాంతం చేయవలసిన అవసరం లేదంటూ తల్లితో పాటు, మిగతా వారికి కూడా చిన్న చురక అంటించింది.

కారుతున్న పాలను శుభ్రం చెయ్యసాగింది. అంతలో పనిమనిషి జానకమ్మ వచ్చి ఆమె చేతిలో చీపురందుకొంది.

మౌనంగా లేచి, స్నానం ముగించుకొని, తల్లి సహాయం లేకుండా, స్కూలు యూనిఫాం ధరించి నెక్ టై బ్యాడ్జీ ... తగిలించుకుని బయటి మెట్టుపై కూర్చున్నాడు.

''అన్నం తినకుండానే. బూట్లు తగిలించుకున్నావ్!...'' అన్నం తినవా?'' అంది.

''తినను...'' మొండి సమాధానం.

''తినవా!.... అయితే నువ్వుబడికి పోనవసరం లేదు... పొద్దుపొద్దున్నే నన్నెందుకు ఏడిపిస్తున్నావ్... దుఃఖం. కోపం మిళితమైన బొంగురుగొంతు.

''నువ్వే ఏడిపిస్తున్నావ్.. మరి ... మరి నా టైగర్... టైగర్‌ని ఎందుకెళ్ళగొట్టావ్?''

''నేనెందుకెళ్ళగొడ్తాను. అదే తాడు తెంచుకొని పోయింది''.

''తెంచుకోలేదు. ఊడదీశావ్ నువ్వు... అన్నీ అబద్ధాలు... నిన్న అది టాయిలెట్‌కు పోయి గలీజ్ చేస్తదని చెప్పావ్... దాన్ని వెళ్ళగొట్టింది నువ్వే'' తల్లి వంక వేలు చూపించాడు.

వేలు... చూపుడువేలు... కుడిచేతి చూపుడు వేలు. దోషిగా తనను చూపిస్తున్న వేలు.. భయపెడ్తున్న వేలు...

''ఆ వేలు.. ఎక్కడ నేర్చావ్, ఈ వేలు చూపించటం... నావన్నీ అబద్ధాలా?'' అంటూ – వంగబెట్టి అక్కడా ఇక్కడా – అనకుండా దెబ్బలు కొట్టసాగింది. ఆ దెబ్బల నుండి కాపాడుకోటానికి, ముఖానికి రెండు చేతులూ అడ్డం పెట్టుకున్నాడు.

ఆ లేత చేతులు రెంటినీ తన ఎడమచేతితో ఒడిసి పట్టుకొని, కుడిచేతితో కొట్టసాగింది.

''కొట్టకు మమ్మీ... మమ్మీ కొట్టకు.. దణ్ణం పెడతా!'' అని బ్రతిమాలుతూ తల్లి ఎడమ చేయి ముంజేతిని గట్టిగా కొరికాడు. అబ్బ – అనుకుంటూ, గాట్లు పడిన చేతిని చూసుకుంటున్న సమయంలో, వీధినపడి ఉరకసాగాడు. తల్లి, జానకమ్మ కేకలు పెడ్తూ వెంటబడ్డారు. చూస్తూ చూస్తుండగానే – జనంలో కలిసి అదృశ్యమై పొయ్యాడు.

***

ఆఫీస్‌కు సెలవు పంపించిన దీప్తి జానకమ్మను వెంటబెట్టుకుని, ఆటోలలో తిరుగుతూ వెదకసాగింది.

బస్‌స్టాండ్, సినిమాహాల్స్, హాస్పిటల్స్, మార్కెట్ మొదలైన జనసమ్మర్దంతో కిటకిటలాడే స్థలాలన్నీ తిరిగారు. గాలించారు. ఫలితం శూన్యం. పొద్దుగూకింది.

రెండవ రోజు – గాలించిన చోట్లలోనే మళ్ళీ గాలింపు. అడిగిన వాళ్ళను మళ్ళీ మళ్ళీ అడిగారు. డ్రైవర్లను, ఆటోవాళ్ళను, టీచర్లను మార్కెట్టులో కూరగాయలమ్ముకొనే వాళ్ళను బ్రతిమాలారు... అందరూ పెదవి విరిచారు. ఆశ అడుగంటింది.

మూడవ రోజు. ఉదయం.. ఆరు గంటలు.

స్కూల్ ప్రిన్సిపాల్, చప్రాసీ హిమామ్... బ్యాంక్ సిబ్బంది – శ్రేయోభిలాషులూ అందరూ ఆ ఇంటికి వచ్చి, శోకదేవతలా ఉన్న దీప్తిని ప్రశ్నిస్తున్నారు. ఓదార్చుతున్నారు.

''ముమ్మాటికీ నాదే తప్పు'' ... చెంపలు వాయించుకుంటూ... ''కుక్కపిల్లను దూరంగా విడిచి పెట్టి రమ్మని చెప్పటం తప్పు... కొడుకుని దూరం చేసుకున్నది నేనే'' అంటూ నెత్తిబాదుకుని ఏడ్వ సాగింది. ఆ ఇంటిచుట్టూ మూగిన జనాన్ని తోసుకుంటూ లోనికొచ్చిన – వీధులూడ్చే మున్సిపాలిటీ ఉద్యోగిని ... ''అమ్మా... స్కూలుబట్టలేసుకొన్న – ఏడెనిమిదేళ్ళ బక్క పలచని ఎర్ర పిల్లవాడు... అక్కడ.. స్టేడియమ్ తంతెల (మెట్లు) క్రింద నిద్రబోతున్నాడు... ఒక వేళ...''

కాళ్ళలో... కొత్త సత్తువ... కళ్ళలో కొత్త ఆశ.

ఉరుకులు – పరుగుల మీద స్టేడియమ్ చేరారు.

సువిశాలమైన స్టేడియమ్ – గుండ్రంగా నిర్మానుష్యంగా ఉంది. దానిని చుట్టిముట్టి అణువణువూ గాలించారు. నిరాశతో కాళ్ళీడ్చుకుంటూ మళ్ళీ ముఖద్వారం చేరారు. వెనుతిరుగుతూన్న సమయంలో 'హిమామ్' అన్నాడు... ''అమ్మా ... 'ఈ పిషాబ్‌ఖానా (మూత్రశాల) నుండి గురక వినిపిస్తుందమ్మా'' అంటూ ముక్కులకు చెయ్యి అడ్డం పెట్టుకొని లోనికెళ్ళి 'అమర్'ను చేతులపై మోసుకొచ్చి – బెంచిపై పడుకోబెట్టాడు. ''బిడ్డా.... దిక్కూ... మొక్కూలేని వాడిలా ఈడపడుకున్నావా?... నాన్నా.... పాపిష్టిదాన్ని నేను. నిన్ను... నిన్ను''... అంటూ నెత్తిపై రెండు చేతులతో బాదుకుంటూ.... ''ఒక్కసారి కళ్ళు తెరువ్... నేను నీ మమ్మీని...'' అంది. కొడుకుని గుండెలపై లాక్కుని గుండెలు అవిశి పొయ్యేలా ఏడ్వసాగింది.

చూస్తూ ఉన్న వాళ్ళు – కళ్ళు ఒత్తుకోసాగారు.

కొడుకు పెదవుల నుండి నురగ – చెవుల నుండి, ముక్కునుండి రక్తం, సన్నగా... సలసల కాగుతున్న శరీరం... అపస్మారక స్థితి... ఆ స్థితిలో కలవరింత.

''మమ్మీ... అగ్గో... విమానం వచ్చేసింది... నేను నీ మధ్య – డ్యాడీ మధ్యన కూర్చుంటా! ... ఓ.కే...'' నవ్వు – నిద్రలో నవ్వు – కళ్ళు తెరవకుండా నవ్వు. అందర్నీ భయభ్రాంతులను చేస్తున్న నవ్వు.

''అగో... మమ్మీ... 'టైగర్'... దాని మమ్మీ దగ్గర పాలు తాగుతుంది''.... ప...ట...ప...టమని పళ్ళు కొరుకుతున్న శబ్దం... మళ్ళీ నవ్వు.

''కొట్టకు... కొట్టకు – మమ్మీ... దణ్ణం పెడతా''... నోటి నుండి నురగ.

''పిచ్చి ప్రేలాపనలు దీప్తి... ఫిట్స్... ఫిట్స్... సంధి పుట్టింది – త్వరగా పోదాం – డాక్టర్ దగ్గరకు'' – ప్రిన్సిపాల్ సూచన. క్షణాలలో హాస్పిటల్ ముందు వ్రాలారు.

''డాక్టర్ సాబ్... లక్షలు ఖర్చయినా సరే... నా కొడుకుని రక్షించండి'' కాళ్ళు మొక్కింది. నెత్తిపై ఆకుపచ్చ గుడ్డలు చుట్టుకొన్న డాక్టర్లు లోనికెళ్ళారు. స్ట్రెచ్చర్‌పై పడుకోబెట్టిన తన కొడుకుని అద్దాల గది లోకి తీసుకెళ్ళారు.

బయట నిరీక్షణ. అందరికళ్ళలో ఆతురత – ఆశ.

పెద్ద డాక్టర్ బయటికొచ్చాడు. ''బ్రెయిన్ హేమరిజ్... టూ లేట్... ఏదో బలమైన షాక్‌కు గురైనట్టుంది. సారీ! తీసుకుపోండి ఫ్యూ మినిట్స్''.

కుమిలి, కుమిలి ఏడుస్తూన్న దీప్తి భుజంపై కొడుకు – తెల్లని టర్కీటవల్ నిండుగా కప్పింది. ఆమెను గట్టిగా పొదివి పట్టుకున్నారు. ఆటోలో – అటు జానకమ్మ – ఇటు ప్రిన్సిపాల్.

ఆటో – ఇల్లు చేరింది.

గడప వద్ద తెల్ల కుక్కపిల్ల – చెవులు రిక్కించి, తోక ఊపుతూ ఎదురొస్తున్న 'టైగర్'–

''నిన్ను పంపించిన పాపం. నాకు'' అంటూ కుక్కపిల్లను, బిగదీసుకు పోయిన తన కొడుకుని టర్కీ టవల్‌తో పొదివి పట్టుకొని 'గొల్లు'మంది దీప్తి. చీరకొంగు జారిపోయింది.

జారిపోయిన చీరె కొంగును భుజాలపై కప్పింది – ప్రిన్సిపాల్.

*

చిరునామా:
తాతిగిరి పోతరాజు
3-45, కోతుల నడుమ,
ఎల్కతుర్తి మండలం, కరీంనగర్ జిల్లా.

